క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం



శ్రీనివాసులును సన్మానిస్తున్న ప్రముఖులు

వెల్దుర్తి: ఏపీ ఎంపీఏ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డు పొందిన స్థానిక కేవీఆర్ జూనియర్ కాలేజీ మాథ్స్ లెక్చరర్ శ్రీనివాసులును శుక్రవారం పలువురు ప్రముఖులు సన్మానించారు. కాలేజీ యాజమాన్యం రాజేశ్, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరసింహనాయుడు, ప్రిన్స్‌పాల్ మధు కుమార్, ఆడిటర్ నారా నరసింహ, వైద్యం రామానాయుడు, హరికృష్ణ, క్రికెటర్ శ్రీకాంత్, లెక్చరర్ కమ్ సినీనటుడు దివాన్ వలి, మద్దయ్య..శ్రీనివాసులును పూల మాలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలంబడితో సాగులో మెలకువలు

హొలహర్వి: ఆధునిక వ్యవసాయ పద్ధతులను పొలంబడి ద్వారా తెలుసుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ శివశంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంజయ్య పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ విచక్షనారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడడం ద్వారా భూమి, వాతావరణం కాలుష్యమవుతుందని, రైతు కూడా అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటాడని చెప్పారు. కషాయాలు, పశువుల పేడ ద్వారా వ్యవసాయం చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, బైక్‌లు, నిందితులను చూపుతున్న పోలీసులు

కృష్ణగిరి: అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన విలేకరులకు తెలియజేశారు. దేవనకొండ మండలం, బేతాపల్లికి చెందిన రవి వద్ద నుంచి ఎరుకలచెరువు గ్రామానికి చెందిన కులుమాల శ్రీవర్ధన్, కురువ నవీన్ కుమార్ గ్రామ సమీపంలోని పెనుమాడ క్రాస్ రోడ్డు వద్ద కర్ణాటకకు చెందిన మద్యాన్ని తీసుకున్నారు. దీన్ని వీరు వెల్దుర్తి మండలం చెరుకుల పాడు గ్రామానికి చెందిన దమ్మిడి బలరాముడు, డొల్ల హరిబాబుకు అందిస్తుండగా కాపుకాచి పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరి నుంచి రెండు బైక్ (ఏపీ21బీపీ8021, ఏపీ39ఆర్‌డీ0329)లతోపాటు ఆరు మద్యం బాక్స్‌ల్లోని 576 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఇరువర్గాల ఘర్షణ



ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాముడు

ఆలూరు రూరల్: పెద్దహోతూరు గ్రామంలో ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షణ పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆటో రాముడు, వీరేష్ మధ్య గొడవలు ఉన్నాయి. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం రెండు వర్గాల వారు పరస్పరం దాడి చేసుకున్నారు. రాముడు, రామాంజి, హనుమంతుకు స్వల్పగాయాలు అయ్యాయి. మరో వర్గానికి చెందిన వీరేష్,హరి, రామాంజనేయులు స్వల్పంగా గాయపడ్డారు. రెండు వర్గాల వారిని ఆస్పత్రిలో చికిత్స చేయించారు. దర్యాప్తు చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

పత్తికొండ(తుగ్గలి) : పుచ్చకాయలమాడ గ్రామంలో శుక్రవారం ఉమ (24) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మూడేళ్ల క్రితం పగిడిరాయికి చెందిన కళ్యాణ్‌బాబుతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయన్న తెలిపారు.

సేంద్రియం..పంటకు జీవం

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి
- రసాయనిక ఎరువుల వాడకంతో రైతులకు నష్టం
- అధికమైతే పుడమికి, పంటకు, మానవాళికి అనర్థం
- రైతులు దృష్టి సారించాలంటున్న అధికారులు

సేంద్రియ ఎరువులు పంటలకు జీవం పోస్తాయి.. నేలకు హాని తలపెట్టవు.. నాణ్యమైన దిగుబడులు లభిస్తాయి.. ఈ పద్ధతిలో సాగైన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుంది.. మానవాళి ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి.. వాతావరణం కలుషితం కాదు.. పంటల సాగుకు తక్కువ ఖర్చు..అని తెలిసినప్పటికీ అధిక శాతం రైతులు నేటికీ రసాయనిక ఎరువులు, మందులు వినియోగిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని నిపుణులు సూచిస్తుండటంతో ప్రస్తుతం పలువురు రైతులు ఈ పద్ధతిలో పంటలు సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు.



తంగరడోణ గ్రామం వద్ద సేంద్రియ పద్ధతిలో సాగులో ఉన్న చౌళకాయల పంట



బొలగోట గ్రామ పొలంలో జీవామృతం తయారు చేస్తున్న రైతు

ఆలూరు రూరల్: పూర్వం పశువుల వ్యర్థాలను పొలాలకు ఎరువుగా వేసేవారు. దీని వల్ల ఎలాంటి క్రిమికీటకాలు, వైరస్‌లు పొలాల్లో దరిచేరేవి కాదు. దిగుబడులు కూడా నాణ్యంగా ఉండేవి. కాలం మారింది. ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా రైతులు సేంద్రియ ఎరువుల స్థానంలో రసాయనిక ఎరువులపై దృష్టి సారించారు. ఈ ఎరువుల వాడకంతో మొదటి ఎక్కువ దిగుబడి బాగానే ఉన్నా..తర్వాత భూమిలో సారవంతం తక్కువై నష్టాలు ఎక్కువవుతున్నాయి. అధిక దిగుబడులు కోసం, తెగుళ్ల నివారణకు ఎరువులు, మందుల వినియోగాన్ని స్థాయికి మించి వినియోగిస్తుండటంతో ఉత్పత్తులు విషతుల్యంగా మారుతున్నాయి. అలాగే.. నేల నిస్సారమై.. దిగుబడులు పూర్తిగా పడిపోతున్నాయి. పరిస్థితి విషమించే అవకాశముండటం, వాతావరణం తీవ్రంగా కలుషితమవుతుండటంతో మళ్లీ పాత పద్ధతులను అవలంభించాలని శాస్త్రవేత్తల సూచనలతో సేంద్రియ విధానంలో పంటలు సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పద్ధతిలో పంటల సాగుకు తక్కువ ఖర్చు అవుతుండటం కలిసి వచ్చే అంశం. ఇప్పటికే సేంద్రియ ఎరువుల వాడకంపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహ చేస్తూనే ఉన్నారు. దేశీయ ఆవుపేడ, మూత్రంతో జీవామృతాలను రైతులే సొంతంగా తయారు చేసుకుని వాడుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడితే మంచిదని సూచిస్తున్నారు.

అధిక మొత్తంలో ఎరువుల వాడకం..

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 46 వేల ఎకరాల్లో రైతులు పత్తి, వేరుశనగ, ఉల్లి, మిరప తదితర పంటుల పంటలతో పాటు ఆకుకూరలు, కూరగాయలు సాగుచేస్తున్నారు. పైరు ఎదుగుదల, అధిక దిగుబడులు రావాలనే ఉద్దేశంతో ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతున్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో పంటల దిగుబడి ఎక్కువగా ఉన్నా అది తాత్కాలికం మాత్రమే. భవిష్యత్‌లో పొలాలు సారవంతం తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారు. సేంద్రియ ఎరువుల వాడకంతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉంది. ప్రధానంగా పొలాల్లో పశువుల పేడ, పొలాల్లో గొర్రెలు, మేకలు మల మూత్రాలు వేయడం ద్వారా భూసారం పెరిగి పంటలు బాగా పండలమే కాకుండా నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు. కాగా ఈ ఏడాది ఆలూరు సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో సేంద్రియ పద్ధతిలో 950 హెక్టార్లలో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

అధికమైతే అనర్థమే..

సీజన్‌కు అనుగుణంగా పంటలకు చీడపీడలు, తెగుళ్లు సోకుతుంటాయి. ఒకటి,రెండు పురుగులు కనిపించగానే రైతులు పైరుపై వివిధ రకాల పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు సైతం చనిపోతున్నాయి. భూసారం దెబ్బతిని పంట దిగుబడి కూడా తగ్గుతుంది. పైరులో అధికంగా పురుగులు ఉన్నప్పుడు మాత్రమే నివారించేందుకు మందులు వినియోగించాలి. పురుగు మందులకు బదులుగా వేప, కానుగ ఉత్పత్తులతో పాటు కషాయం, జీవామృతం తదితర వాటిని వాడితే ఖర్చు తగ్గడమే కాకుండా పురుగు నివారణకు బాగా పనిచేస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.

పశుసంతతి తగ్గడమే ప్రధాన కారణం...

గతంలో గ్రామాల్లో పశువులు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గడంతో పేడ లభించడం ఇబ్బందిగా మారింది. దీంతో రైతులు చేసేది లేక రసాయనిక ఎరువులు వాడుతున్నారు. దీని వల్ల ఖర్చులు అధికమై దిగుబడులు తగ్గుతున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా రైతులు పశుసంపద పెంచుకుని సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.



కురువళ్లి వద్ద పత్తిలో తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

అవగాహన కల్పిస్తున్నాం



రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా జీవామృతాలను తయారు చేసుకుని వినియోగించుకునేలా క్షేత్రస్థాయి అధికారుల ద్వారా గ్రామాల్లో రైతులకు సలహాలు సూచనలు ఇస్తున్నాం. క్రిమి సంహారిక మందులు పిచికారీ, రసాయన ఎరువుల వినియోగంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా మోతాదుకు మించరాదు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు విధిగా పాటించాలి.

– సునీత,ఏడీఏ, ఆలూరు

పంట దిగుబడి ఎక్కువ..ఖర్చు తక్కువ



నాకు ఉన్న మూడు ఎకరాల్లో ప్రస్తుతం మిరప పంట సాగు చేశా. పంట సాగు కోసం పేడ, ఘన,ద్రవ జీవామృతాలను ఎరువుగా వాడుతున్నా. దీంతో పంట దిగుబడి ఎక్కువ వస్తోంది. అంతేకాక పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉంటుంది. ఖరీఫ్ ప్రారంభానికి ముందు పొలంలో సేంద్రియ ఎరువు చల్లడం ద్వారా భూసారం పెరుగుతుంది. లేదా గొర్రెలు, మేకలు ఆపితే పొలం సారవంతం కావడంతో పాటు దిగుబడి అధికంగా లభిస్తుంది. మా ప్రాంతంలో ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఇలాంటివి చేస్తాం. తెగుళ్ల నివారణకు కషాయం, జీవామృతం, వేప, కానుగ ఉత్పత్తులను వాడుతాం.

– వీరభద్రి, రైతు గోనేహాల్

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి



పంటల సాగులో జీవామృతం వాడి అధిక దిగుబడి సాధిస్తున్నాను. ఈ ఏడాది 15 సెంట్లలో కాకరకాయ,బీరకాయ పంట సాగు చేశాను.పెట్టుబడి రూ.2 వేలు ఖర్చు అయ్యింది. రూ.10వేల పంట చేతికొచ్చింది. కూరగాయల సాగు కోసం జీవామృతం వాడుతున్నా.

– పులిశేఖర్,రైతు,తంగరడోణ,గ్రామం, ఆస్పరి మండలం,



మనేకుర్తి గ్రామ సమీప పొలాల్లో సేంద్రియ ఎరువు వేసిన దృశ్యం (ఫైల్)



హొలహర్వి మండలం బిలేహాల్ సమీప పొలాల్లో గొర్రెలు,మేకలను నిలిపిన దృశ్యం (ఫైల్)



ఆలూరు వద్ద మిరప పంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

తీర్మానం లేకుండా చెరువులు అప్పగిస్తారా?



ఈఓను ప్రశ్నిస్తున్న పంచాయతీ సభ్యులు

మద్దికెర : పంచాయతీ సభ్యుల తీర్మానం లేకుండా మత్స్యకార సంఘానికి చెరువులను అప్పగించడం ఏమిటని సభ్యులు లక్ష్మినారాయణ, జంబు ప్రశ్నించారు. శుక్రవారం ఈఓ శివకుమార్‌తో మాట్లాడుతూ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు మత్స్యకార సంఘానికి సంబంధించి మద్దమ్మకుంట, యజ్ఞం చెరువు, బనవాసి కుంటలో చేపలు పెంచుకోడానికి కేవలం రూ.25 వేలకు అనుమతులు మంజూరు చేయడంతో పంచాయతీ ఆదాయానికి గండిపడిందన్నారు. గతంలో సభ్యుల తీర్మానం మేరకు చెరువులను సంఘానికి ఇవ్వడంతో వారు ఏడాదికి రూ.70 వేలు చెల్లించారని గుర్తు చేశారు. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు ప్రస్తుతం రూ.1.20 లక్షలు చెల్లించాలని చెప్పారన్నారు. గతంలో మద్దమ్మకుంటకు వర్షపు నీరు వచ్చేదని అయితే గత పదేళ్లుగా వానలు రాక నీరు లేదన్నారు. కానీ గ్రామానికి నీటి సమస్య తీర్చేందుకు దాదాపు ఏడాదికి రూ.8 లక్షలు ఖర్చు పెట్టి నీటిని పంపింగ్ చేస్తున్నారన్నారు. దీంతో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి పంచాయతీకి భారంగా మారిందని తెలిపారు. అందుకోసమే సంఘానికి మొత్తాన్ని పెంచారన్నారు. కానీ డీఎల్‌పీఓ వచ్చి చెరువులను సంఘానికి ఇవ్వాలని జీవో వుందని సర్పంచ్, పంచాయతీ సభ్యులు తీర్మానం లేకుండా కేవలం రూ. 25 వేలకే ఇవ్వడం సరికాదన్నారు. వేలాల ద్వారా పంచాయతీకి నష్టం వచ్చేలా చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకార సంఘం సభ్యుల జీవనానికి ఉచితంగా ఇవ్వాలని తీర్మానం చేసి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం



తుగ్గలి కేజీబీవీలో మొక్క నాటుతున్న ఏపీడీ పక్కీరప్ప

వెల్దుర్తి: గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు, పర్యావరణాన్ని సంరక్షించేందుకు పాటుపడదామని ఎన్ఆర్‌ఈజీఎస్ ఈసీ మధుకృష్ణ, పుల్లగుమ్మి సెక్రటరీ రెహమతుల్లా అన్నారు. శుక్రవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి, పుల్లగుమ్మి గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ ఎల్‌ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్, రమాకాంత్ రెడ్డి, పుల్లగుమ్మి నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు.

తుగ్గలి : స్థానిక కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ఆవరణలో ఏపీడీ పక్కీరప్ప మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లస్టర్ టీపీ వెంకప్ప, ఈసీ ప్రదీప్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, పాఠశాల ప్రత్యేక అధికారిణి సాహీన్ పాల్గొన్నారు.

మద్దికెర : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచాలని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఎంఈఓ రంగస్వామి, ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి జ్యోతి, ఉపాధి ఈసీ రాఘవేంద్ర, టీఏలు నరేంద్ర, సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

డెంగీ కేసు నమోదు

దేవనకొండ: కె.వెంకటాపురం గ్రామంలో ఏడు సంవత్సరాల బాలికకు డెంగీ లక్షణాలు ఉన్నాయని జిల్లా అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక వైద్య సిబ్బంది, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, ఎంపీహెచ్‌ఈఓ రంగస్వామి శుక్రవారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించారు. ఎక్కువ రోజుల పాటు ఇళ్లల్లో డ్రమ్ములు, నీటి తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఎంపీఎల్‌హెచ్ గంగాధర్, ఏఎన్‌ఎం శివమ్మ ఉన్నారు.

గంజాయి రహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

పత్తికొండ(తుగ్గలి) : గంజాయి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య కోరారు. శుక్రవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో అర్బన్, రూరల్ సీఐలు జయన్న, పులిశేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ. ఇటీవల దొంగతనం కాబడిన రెండు వాహనాలు, గంజాయి కలిగి ఉన్న నలుగురు యువకులను (ఇద్దరు మైనర్లు) నాలుగు రోజుల క్రితం పట్టుకుని విచారించాం. ఆ సమాచారంతో ఆస్పరి సీఐ ద్వారా ఓ వ్యక్తి పట్టుకుని అతని పొలానికి వెళ్లగా అక్కడ ఇప్పుడిప్పుడే పెరుగుతున్న 53 గంజాయి మొక్కలు దొరికాయి. పత్తికొండలో గంజాయితో దొరికిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ఆస్పరిలో కేసు నమోదు చేశామన్నారు. నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో కూడా రెండు బైక్‌లకు సంబంధించి కేసు నమోదు చేశారన్నారు. గ్రామీణల ప్రాంతాలకు గంజాయి విస్తరిస్తుండం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న గంజాయిని ఆదిలోనే అరికట్టేందుకు గట్టి చర్యలు చేపట్టామని చెప్పారు. ఇందు కోసం కాలేజీలు, పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఓ కంట కనిపెట్టుకుని ఉండాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా మండల కేంద్రంతో పాటు రామళ్లకోట, కలుగొట్ల సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

పరామర్శ

తుగ్గలి : రైతు సంఘం జిల్లా నాయకులు జీ.ఎర్రగుడి భాస్కరరెడ్డి సతీమణి విశాలాక్ష్మి మూడు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జీ.ఎర్రగుడికి వెళ్లి భాస్కరరెడ్డిని పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జిట్టానాగేష్‌యాదవ్, జెడ్పీటీసీ పులికొండ నాయక్, మాజీ సభ్యుడు నారాయణ నాయక్, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ కృష్ణానాయక్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

హొళగుంద: ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ బాల నరసింహులు శుక్రవారం తెలిపారు. ఆలూరు మండలం హుళేబీడు గ్రామానికి చెందిన వ్యక్తులు నదిలో అక్రమంగా ఇసుకను తవ్వుకుని తీసుకెళ్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు.

చేపల పెంపకానికి వేలం

తుగ్గలి : మండలంలోని జొన్నగిరి చెరువులో ఏడాది పాటు చేపల పెంపకానికి శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. సర్పంచ్ ఓబులేసు అధ్యక్షతన నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన కాటినేని పుల్లన్న రూ.15 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే ఆటో సుంకం వసూలుకు టివి కుమార్ రూ.34,500కు దక్కించుకున్నారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప యాదవ్, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ గోపాల్ పాల్గొన్నారు.

80 శాతం ఈ-కేవైసీ పూర్తి

కృష్ణగిరి: ఖరీఫ్ పంటల నమోదుకు సంబంధించి రైతు ఈ-కేవైసీ ఇప్పటి వరకు 80 శాతం పూర్తి చేసినట్లు ఏఓ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పంట నమోదుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉందని, అలాగే రైతు ఈ-కేవైసీ కూడా వందశాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

హొలహర్వి: మండలంలోని బాపురం ఎల్‌ఎల్‌సీ కాలువలో గురువారం సోమశేఖర్‌గౌడ్ (38) అనే వ్యక్తి గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం సోమశేఖర్‌గౌడ్ మృతదేహం కాలువలో లభ్యమయ్యింది. కాలువలో ఉన్న వినాయక విగ్రహాలు ట్రాక్టర్ ద్వారా తొలగించారు. వినాయక విగ్రహాల మధ్యలో ఇరుక్కుపోవడంతో సోమశేఖర్‌గౌడ్ మృతిచెందినట్లు ఎస్‌ఐ చంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.


బ్యాంక్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

హొలహర్వి: గూళ్యం గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) అసిస్టెంట్ మేనేజర్ రైతులు, ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ పత్తికొండ డివిజన్ అధ్యక్షుడు గూళ్యం యల్లప్ప, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కుమారస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం బ్యాంకు ఎదుట రైతులతో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ వినియోగదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, రైతలను దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు చిన్న మారెప్ప, మహేష్, హనుమంతు, సీతప్ప, గోవింద, శివప్ప పాల్గొన్నారు.

బండలాగుడు విజేత వైఎస్సార్ జిల్లా వృషభాలు



ఎద్దుల యజమానికి బహుమతి అందిస్తున్న దాతలు



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ

- ముగిసిన మారెమ్మ బ్రహ్మోత్సవాలు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు గ్రామంలో ఆరు రోజుల పాటు జరిగిన మారెమ్మ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సీనియర్ విభాగం అంతర్ రాష్ట బండలాగుడు పోటీల్లో వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, చౌటుపల్లికి చెందిన మార్తల చంద్రా ఓబుల్ రెడ్డి వృషభాలు మొదటిస్థానంలో నిలిచాయి. రెండవ స్థానంలో ఆయనకు చెందిన మరో వృషభాల జత నిలిచాయి. మూడవ స్థానంలో నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం, పీఆర్‌పల్లె మంగళి నాగయ్య వృషభాలు, నాల్గవ స్థానంలో వైఎస్సార్ జిల్లా, మైదుకూరు టౌన్‌కు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ వృషభాలు, ఐదవస్థానంలో అనంతపురం జిల్లా ఏ.నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా ఎద్దులు నిలిచాయి. దీంతో ఎద్దుల యజమానులకు దాతల సహకారంతో, దాతలు, ఆలయ కమిటీ సభ్యులు వరుసగా రూ.70వేలు, రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30 వేలను అందజేశారు.ఆరు రోజులపాటు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సంక్షేమం మరచి..సంబరాలా?

ఆలూరు: టీడీపీ అధినేత సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకుండా, సంక్షేమాన్ని గాలికొదిలేసి.. వంద రోజుల పాలన పేరుతో సంబరాలు చేసుకోవడం ఏంటని ఎమ్మెల్యే బి.విరూపాక్షి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత నెలలో కురిసిన వర్షాల వల్ల కృష్ణానదికి వరద పోటెత్తడం, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో విజయవాడ నగరం నీటి మునిగి 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడానికి ఈ ప్రభుత్వం కారణం కాదా అని నిలదీశారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా డైవర్ట్ రాజకీయాలపై దృష్టి సారించి కాలం వెళ్లదీస్తోందని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలో వారంతా తిరగబడతారన్నారు. ఎలాగైనా వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష తీర్చుకోవాలని పగతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తిరుపతి లడ్డూ నాణ్యత కూడా ఇందులో భాగమేనన్నారు. సంబరాలు మాని ప్రజలకు మేలు చేయాలని సూచించారు.

నివాళి

మద్దికెర : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ కొత్తపేట సుదర్శనరెడ్డి భార్య, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి తల్లి కొత్తపేట గిరమ్మ (84) శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, కోట్ల సుజాతమ్మ, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచు మల్లికార్జున, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజన్న, మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, తుగ్గలి నాగేంద్ర, మాజీ సర్పంచులు శాంతన్న, వెంకటేశులు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.